


చెంగాళ పరమేశ్వరి సేవలో ఇస్రో ఛైర్మన్



ప్రజాశక్తి - సూళ్లూరుపేట: ఇస్రో ఛైర్మన్ డా'. వి.నారాయణన్ ఎల్వియం3-యం5 ఉపగ్రహ ప్రయోగం విజయవంతం కావాలని శ్రీ చెంగాళమ్మ పరమేశ్వరి అమ్మవారిని ఆదావారం దర్శించుకొని పూజలు నిర్వహించారు. ఆయనకు సహాయ కమీషనరు అండ్ కార్యనిర్వాహణాధికారి ప్రసన్నలక్ష్మీ ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి, అమ్మవారి దర్శనం, పూజలు చేయించారు.

నిప్పులు చెరుగుతూ.. నింగికి ఎగురుతూ..

సిఎంఎస్03 రాకెట్ ప్రయోగం విజయవంతం


జయహో భారత్ అంటూ.. వీక్షకుల నినాదాలు

ప్రజాశక్తి - సూళ్లూరుపేట : శ్రీహరికోట సతీష్ ధావన్ స్పేస్ సెంటర్ నుండి ఆదివారం సాయంత్రం 5.26 నిమిషాలకు ప్రయోగించిన సిఎంఎస్03 రాకెట్ ప్రయోగం విజయవంతమైంది. ఈ ప్రయోగం ద్వారా 4400 కేజీల సిఎంఎస్03 అనే భారీ ఆర్బిట్ లోకి 16.29 వ్యవధిలో నిర్దిష్ట కక్షలోకి సిఎంఎస్03 ఉపగ్రహాన్ని ఇస్రో శాస్త్రవేత్తలు ప్రవేశపెట్టారు. మొట్టమొదటి సారిగా 3వ స్టేజ్ అయినా క్రయోజెనిక్ స్టేజ్ నందు ఉపగ్రహ చాంబర్‌ను రెండు నిమిషాల పాటు ఆపి, రీస్టార్ట్ కోసం మరింత సమాచారం సేకరించనున్నట్లు ఇస్రో చైర్మన్ ఆర్.నారాయణన్ తెలిపారు. డిసెంబర్ నెలలో ఎల్విఎం ఎం.6 బ్లూ బర్డ్ ప్రయోగం, పిఎస్ఎల్వీ సి 62 తో పాటు ఎస్ ఎస్ ఎల్ వి, పిఎస్ఎల్వీ కమర్షియల్ ప్రయోగాలు





ఉపగ్రహాన్ని 3 దశల్లో నిర్దిష్ట కక్షలోకి ప్రవేశ పెట్టారు. 43.5 మీటర్ల పొడవు 640 టన్నుల బరువు గల రాకెట్ భూమికి 29 వేల 370 కిలో మీటర్ల దూరంలో గల జియో సింక్రనస్ ట్రాన్ఫర్ చేశారు. ఈ ఎక్పరిమెంట్ ప్రయోగం విజయ వంతమైందని ఇస్రో చైర్మన్ సంతోషం వ్యక్తం చేశారు. ఈ ప్రయోగం ద్వారా భారత భూభాగంలో సముద్రతీర ప్రాంతంలోని సైనికుల అవసరాల ఉంటాయని తెలిపారు. రాబోవు 5 సంవత్సరాల వ్యవధిలో 50 ప్రయోగాలు ఉంటాయని చైర్మన్ తెలిపారు. ఈ భారీ ఉపగ్రహ ప్రయోగ విజయంతో ఇస్రో శాస్త్రవేత్తలు సంబరాల్లో మునిగి తేలారు.



శ్రీహరికోటలో రాకెట్ ప్రయోగం...వీక్షకుల సందడి...

శ్రీహరికోట నుండి ఆదివారం సాయంత్రం ఎల్విఎం3 రాకెట్‌ను శాస్త్రవేత్తలు ప్రయోగించారు. ఈ కార్యక్రమాన్ని వీక్షించడానికి తమిళనాడు, కర్ణాటక, తెలంగాణ వంటి పలు రాష్ట్రాల నుండి భారీ సంఖ్యలో విద్యార్థిని, విద్యార్థులు,వీక్షకులు షార్ గ్యాలరీ పాయింట్ వద్దకు చేరుకున్నారు.దీంతో ఆ ప్రాంతం సందడిగా మారింది. జాతీయ జెండా ఎగరవేస్తూ జయహో భారత్ నినాదాలు చేశారు.

భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) రూపొందించిన జిఎస్ఎల్వీ రాకెట్లలో బాహుబలి అయిన ఎల్ వి ఎం3 రాకెట్ ప్రయోగం విజయవంతమైంది. ఒక క్రయో ఇంజన్‌ను దగ్గర ఉంచుకుని పూర్తి స్వదేశీ సాంకేతిక పరిజ్ఞానంతో క్రయోదశను కూడా రూపొందించి జిఎస్ఎల్వీ సిరీస్ లో ఇప్పటికీ 19 ప్రయోగాలు చేయగా 15 ప్రయోగాలను మన శాస్త్రవేత్తలు విజయవంతం చేశారు. 4 ప్రయోగాలు మాత్రమే విఫలమ య్యాయి. దీన్ని దృష్టిలో ఉంచుకుని జిఎస్ఎల్వీ మార్క్‌బి3 (ఎల్వీఎం3) రాకెట్ లాంటి భారీ రాకెట్లను రూపొందించడంలో కూడా ఎంతో పరిణితిని సాధించారు. జిఎస్ఎల్వి మార్క్‌బి3 రాకెట్‌ను మొదటిగా 2014 డిసెంబర్ 25వ తేదీన ప్రయోగాత్మకంగా ప్రయోగించి విజయం సాధించారు. ఆ తర్వాత 2017 జూన్ 5 జి ఎస్ ఎల్ వి మార్క్ 3బిడి1 ద్వారా జిశాట్‌బి19 అనే ఉపగ్రహాన్ని, 2018 నవంబర్ 14న జిఎస్ఎల్వి మార్క్3బిడీ 2 ద్వారా జిశాట్ 29 ప్రయోగాలు చేసి విజయాలు సాధించారు. 2019 జూలై 22న చంద్రయాన్‌బి2 ప్రయోగాన్ని నిర్వహించే సమయంలో జీఎస్ఎల్వీ మార్క్3 పేరు ఉన్న ఈ రాకెట్ ను ఎల్విఎం3 ఎం 1 గా పేరు మార్పు చేశారు. అప్పటినుంచి జిఎస్ఎల్వి మార్క్3గా పేరున్న ఈ రాకెట్‌ను ఎల్ విఎం3 అనే పేరును వాడుకలోకి తెచ్చారు. 2022 అక్టోబర్ 23న ఎల్విఎం3బిఎం 2,2023 మార్చి 26న ఎల్విఎం 3బిఎం3 ప్రయోగాల్లో వన్ వెబ్ ఇండియా పేరుతో రెండు వాణిజ్యపరమైన ఉపగ్రహాల నిర్వహించి విజయాలను అందుకున్నారు. ఆ తర్వాత ఇస్రోకు, భారతదేశానికి అత్యంత ప్రతిష్టాత్మకమైన చంద్రయాన్‌బి3 ప్రయోగాన్ని 2023 జూలై 14న ఎల్విఎం3 ఎం4 రాకెట్ ద్వారా ప్రయోగించి ఇస్రో చరిత్రలో ఒక మైలురాయి లాంటి ప్రయోగాన్ని విజయవంతం చేసి ప్రపంచాన్నే అబ్బుర పరిచారు. అంటే ఎల్విఎం3 రాకెట్ సిరీస్ లో ఇప్పటిదాకా 7 ప్రయోగాలను విజయవంతంగా నిర్వహించి ఆదివారం 8 ప్రయోగం కూడా విజయవంతగా నిర్వహించారు.

శ్రీసిటీ ఎండీ అభినందనలు

ప్రజాశక్తి - సత్యవేడు: ఎల్వీఎం3-ఎం5 రాకెట్ ప్రయోగం విజయవంతం అయినందుకు శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి హర్షం వ్యక్తం చేశారు. ఈ ప్రయోగం ద్వారా సిఎంఎస్-03 (జిశాట్-7ఆర్) ఉపగ్రహాన్ని నిర్ణీత కక్ష్యలోకి పంపడంలో ఘన విజయం సాధించినందుకు, భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) అద్యక్షులు డా. వి.నారాయణన్‌కు, షార్ డైరక్టర్ ఈ.ఎస్. పద్మకుమార్, షార్ శాస్త్రవేత్తలకు, ఇతర సిబ్బందికి అభినందనలు తెలిపారు. ఇంతవరకు ప్రయోగించిన ఉపగ్రహాల్లో ఇదే అత్యంత బరువైన దని ఆయన పేర్కొంటూ, భారత నౌకాదళానికి, కమ్యూనికేషన్స్ పరంగా ఇది కొత్త శక్తిని అందించ గలదని, తద్వారా హిందూ మహాసముద్రంలో రక్షణ వ్యవస్థ మరింత పటిష్టమవుతుందని తెలిపారు.

నరువీ హాస్పిటల్ ఆధ్వర్యంలో వాకథాన్



జెండా ఊపి వాకథాన్ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

ప్రజాశక్తి-తిరుపతి (మంగళం): ప్రపంచ పక్షవాత దినోత్సవం సందర్భంగా పక్షవాతంపై అవగాహన కల్పించేందుకు వేలూరు నరువీ హాస్పిటల్ ఆధ్వర్యంలో వాకథాన్ 2025 కార్యక్రమాన్ని హాస్పిటల్ చైర్మన్ డాక్టర్ జి.వి. సంపత్ అధ్యక్షతన, వేలూరు నగర మేయర్ సుజాత ఆనందకుమార్, వేలూరు ఎమ్మెల్యే పి. కార్తికేయన్ ఆదివారం జెండా ఊపి ప్రారంభించారు. ఈ అవగాహన వాకథాన్‌లో ఇందులో 500 మంది పక్షవాతంపై అవగాహన కల్పించే బ్యానర్లు పట్టుకుని పాల్గొన్నారు. నరువీ హాస్పిటల్ చైర్మన్ డా. జి.వి. సంపత్ మాట్లాడుతూ అనారోగ్యానికి కారణమయ్యే జంక్ ఫుడ్, డ్రగ్స్, ఒత్తిడి వంటి అనేక కారణాల వల్ల పక్షవాతం వచ్చే అవకాశం ఉందన్నారు. ఇదే కారణాలతో నేటి యువత ఎక్కువగా పక్షవాతం బారిన పడుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. పక్షవాతంపై సరైన అవగాహన కల్పించడం చాలా అవసరమన్నారు. వేలూరు కోట మైదానం నుండి ప్రారంభమైన ఈ పక్షవాతం అవగాహన వాకథాన్‌లో నరువీ హాస్పిటల్ వైస్ చైర్మన్ అనితా సంపత్, చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ శరవణన్ రామన్, జనరల్ మేనేజర్ నితిన్ సంపత్, న్యూరాలజీ డిపార్ట్మెంట్ హెడ్ డాక్టర్ చిత్తంబలం, వివిధ నర్సింగ్ కళాశాలల విద్యార్థులు, నరువీ హాస్పిటల్ వైద్యులు, నర్సులు, వైద్య సిబ్బంది, ఉద్యోగులు పాల్గొన్నారు.

సిఐటియు అఖిల భారత మహాసభలను జయప్రదం చేయండి



సిఐటియు అఖిల భారత మహాసభల కరపత్రాలు విడుదల చేస్తున్న నాయకులు

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : డిసెంబర్ 31 నుండి 2026 జనవరి 4 తేదీ వరకు విశాఖపట్నంలో జరుగనున్న సిఐటియు అఖిల భారత 18వ మహాసభలను జయప్రదం చేయాలని అధ్యక్షులు ఎస్.డి.రఫీ పిలుపు నిచ్చారు. తిరుపతి జిల్లా, గూడూరు, భవన నిర్మాణ కార్మిక సంఘం భవనం కార్యాలయంలో ఆదివారం జరిగిన కమిటి సభ్యుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సమావేశానికి భవన నిర్మాణ కార్మిక సంఘం గౌరవాధ్యక్షులు జోగి శివకుమార్ హాజరయ్యారు. ఈ సందర్భంగా సిఐటియు అఖిల భారత మహాసభల కరపత్రాలు విడుదల చేశారు. 9వ తేదీన భవన నిర్మాణ కార్మిక సంఘం జనరల్ బాడీ సమావేశం నిర్వహించనున్నామని, అందరూ పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి సేలం సేకరాచారి, సిఐటియుగూడూరు పట్టణ ప్రధాన కార్యదర్శి బి.వి.రమణయ్య, సీనియర్ నాయకులు గండికోట మధు, ఖాదర్ బాషా, రత్నం,కాసిం, కువైట్ బాబు, ఓజిలి బాషా తదితరులు పాల్గొన్నారు.

గూగుల్, ఫేస్ బుక్ గుప్పెట్లో యాడ్స్ రెవెన్యూ

- **న్యూస్ క్లిక్ ఎడిటర్ ప్రబీర్ పురకాయస్థ**

ప్రజాశక్తి - తిరుపతి టౌన్: తొంభై శాతం యాడ్ రెవెన్యూను గూగుల్, ఫేస్ బుక్‌లు అదుపు చేస్తున్నాయి. చిన్న పత్రికలకు, ప్రాంతీయ వార్తా సంస్థలకు ఇదొక పెద్ద సవాలుగా మారిందని 'న్యూస్ క్లిక్' ఎడిటర్ ప్రబీర్ పురకాయస్థ ఆవేదన వ్యక్తం చేశారు. ఆయన తిరుపతికి వచ్చిన సందర్భంగా, నేటి వార్తా సంస్థల తీరు తెన్నుల గురించి ఆదివారం స్థానిక ప్రెస్ క్లబ్‌లో పాత్రికేయులనుద్దేశించి తెలిపిన వివరాలు ఆయన మాటల్లోనే.. "నేను వామపక్షభావాలున్న వాడిని. నా రాజకీయాల వల్ల ప్రజలకు ఏం చెప్పాలి, ఎలాంటి సమాచారం ఇవ్వాలన్నది ఆలోచించాను. నా రాజకీయాలు, సామాజిక సంబంధాల కోసం ఒక స్వతంత్ర ప్లాట్ ఫాం ఏర్పాటు చేయాలనుకున్నాను. కొద్దిమంది మిత్రులతో కలిసి 'న్యూస్ క్లిక్'ను స్థాపించాను. ప్రజలకు వాస్తవాలు చెప్పడం ముఖ్యం అనుకున్నాం. ప్రజాస్వామ్యానికి జాతీయంగా, అంతర్జాతీయంగా ఫ్యాసిస్టు శక్తుల నుంచి ఎదురవుతున్న సవాళ్లను ఎలా ఎదుర్కోవాలి? ఈ సవాళ్లను ఎదుర్కోవడంలో ప్రెస్ క్లబ్ పాత్ర ఏమిటి? నూతన టెక్నాలజీ వస్తోంది. దీని ద్వారా ప్రజలకు ఏం చెప్పదలుచుకున్నాం అన్నది మన ముందున్న ప్రశ్న. నేటి జర్నలిస్టులు ఏం నేర్చుకోవాలి? చిన్న చిన్న సంస్థలకు ఎలాంటి సాంకేతికత కావాలి? పెద్ద సంస్థల నుంచి ఎదురయ్యే పోటీలో మనం ఎలా చేయాలి? కొత్తగా వచ్చిన జర్నలిస్టులకు ఎలా చేయాలో చెప్పాను. ముఖ్యంగా ప్రజలు ఏం కోరుకుంటున్నారు? లక్షలాది మంది రైతులు ఢిల్లీకి ఎందుకు వస్తున్నారు? వారికి ఏం కావాలి? ట్రాఫిక్ జాం ఎందుకవుతోంది? వాటికి పరిష్కారాలేమిటి? వంటి క్షేత్ర స్థాయి విషయాల గురించిన దృష్టి కోణం జర్నలిస్టులకు అవసరం. జర్నలిస్టులు ఆధునిక టెక్నాలజీని ఎలా ఉపయోగించుకోవాలో ఆలోచించాలి." సీనియర్ జర్నలిస్ట్ నేతాజీ అడిగిన ప్రశ్నకు సమాధానంగా కార్పొరేట్ శక్తుల ఆధ్వర్యంలో నడిచే సంస్థలనుంచి వచ్చే పోటీని ఎదుర్కోవడం చాలా కష్టమన్నారు. ఈ పోటీ ప్రపంచంలో స్వతంత్రంగా వార్తలు అందివ్వడమే ముఖ్యం అన్నారు. మరో సీనియర్ జర్నలిస్ట్ గాలి నాగరాజు వేసిన ప్రశ్నకు సమాధానంగా "నాటి ఎమర్జెన్సీకి, నేటి ఎమర్జెన్సీ పరిస్థితులకు మధ్య తేడా అయితే ఉంది. అప్పటితో పోల్చుకుంటే ఇప్పుడు దాడులు చేసే అవకాశాలు పెరిగాయి. ఎమర్జెన్సీ తరువాత జరిగిన ఎన్నికల్లో ఇందిరాగాంధీ ఓడిపోయింది. ప్రతిఘటించే అవకాశం ఎప్పుడూ ఉంటుంది. నేను ఆశావాదిని. నా ఆశ ఏమిటంటే, సమాజం పెద్ద శక్తి. దాన్ని ఎవరూ ఆపలేరు. ప్రజాశక్తిని ఓడిస్తారని నేనను కోవడం లేదు. ప్రజల గొంతులను అదుపు చేయలేరు" అని స్పష్టం చేశారు. తిరుపతి ప్రెస్ క్లబ్ అధ్యక్షులు ఆర్.మురళి వేసిన మరొక ప్రశ్నకు సమాధానంగా "కొన్ని గొంతులు కాదు, అనేక గొంతులు తమ అభిప్రాయాలను వ్యక్తం చేయాలి. పెద్ద పెద్ద పెట్టుబడులను, ప్రభుత్వాలను ఎలా ఎదుర్కోవాలో ఆలోచించాలి. నిజంగా ఇది పాఠకులకు, రచయితలకు, జర్నలిస్టులకు ఒక ఘర్షణే" అని ప్రబీర్ పురకాయస్థ చెప్పారు. ఎమర్జెన్సీలో ప్రబీర్ పురకాయస్థను నాసా కింద అరెస్టు చేయడం, 2009లో ఆయన స్థాపించిన న్యూస్ క్లిక్ పైన ఎన్ ఫోర్స్ మెంట్ డైరెక్టరేట్ దాడులు, ఉపా చట్టంలోని వివిధ సెక్షన్ల కింద పెట్టిన కేసులు, సుప్రీం కోర్టు జోక్యం వంటి విషయాలన్నిటినీ సీనియర్ జర్నలిస్ట్ రాఘవ వివరించారు. ఈ సభలో తిరుపతి ప్రెస్ క్లబ్ కార్యదర్శి బాలచంద్ర, ఒక నాటి ప్రజాశక్తి రిపోర్టర్, ప్రస్తుత సీపియం నాయకులు కందారపు మురళి కూడా పాల్గొన్నారు. అనంతరం ప్రెస్ క్లబ్ అధ్యక్ష కార్యదర్శులు ప్రబీర్ పురకాయస్థను ఘనంగా సన్మానించారు. ఈ సమావేశంలో తిరుపతి పరిసర ప్రాంత జర్నలిస్టులు, పుర ప్రముఖులు పాల్గొన్నారు.



ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడుతున్న ప్రబీర్ పురకాయస్థ, వేదికపై సిపిఎం నాయకులు కందారపు మురళి తదితరులు

డాలర్ పెత్తనం ఇకపై సాగదు

- **సదస్సులో ప్రముఖ పాత్రికేయులు ప్రబీర్ పురకాయస్త**



ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో: సిఐటీయూ 18 అఖిల భారత మహాసభలను పురస్కరించుకొని ఆదివారం యశోద నగర్, వేమన విజ్ఞాన కేంద్రంలో ప్రముఖ కార్మిక ఉద్యమ నాయకుడు కామ్రేడ్ నందూరి ప్రసాద్ రావు స్మారక సెమినార్‌ను, మధ్యతరగతి ఉద్యోగుల సమన్వయ కమిటీ కన్వీనర్ కే.ఎన్ .ఎస్ ప్రసాద్ రావు అధ్యక్షతన ప్రజాస్వామిక హక్కులపై దాడి అంశంపై సదస్సు జరిగింది. ఈ సదస్సులో ప్రముఖ పాత్రికేయుడు, న్యూస్ క్లిక్ వ్యవస్థాపకుడు ప్రబీర్ పుర కాయ స్థ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ఆయన మాట్లాడుతూ ట్రంపు అధికారంలోకి వచ్చిన తర్వాత భారత్‌పై 50 శాతం సుంకాలు విధించాడన్నారు. అమెరికా తన పెత్తనాన్ని సోషలిస్ట్ దేశాలు నిలువరి స్తున్నాయని పేర్కొన్నారు. అన్ని దేశాలలో డాలర్ పెత్తనం కొనసాగించాలని అమెరికా చేస్తున్న ప్రయ త్నాలు ఇక సాగవన్నారు. అమెరికాలోనే ట్రంప్‌కి వ్యతిరేకంగా 70 దేశాలలో నిరసనలు తెలిపిన విషయాన్ని గుర్తు చేశారు. తన అహంకారం తగ్గించుకొని చైనాతో, అమెరికా చర్చలు జరిపిందని, చివరికి చైనా మాట అమెరికా వినక తప్పలేదని తెలిపారు. భారతదేశంలో నూతన ఆర్థిక విధానాల వల్ల కార్మిక హక్కులపై దాడి పెరుగుతుందన్నారు. కేంద్ర ప్రభుత్వం కార్మిక హక్కులని కాలరాస్తున్నాయని విమర్శించారు. కేంద్ర ప్రభు త్వం అమెరికాకు జూనియర్ భాగస్వామిగా మారిందన్నారు. సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు కందారపు మురళి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఎనిమిది గంటల పని విధానం రద్దుచేసి రోజు 13 గంటల పని విధానాన్ని అమలు జరపాలని చేసిన చట్టం అమలు కోసం రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం శాసన సభలో చట్ట సవరణ చేస్తే, వ్యతిరేకించాల్సిన వైసిపి కూడా సమర్థించిందని పేర్కొన్నారు. రాష్ట్రంలో ఉన్న అన్ని పార్టీలు బిజెపికి లొంగిపోయాయని కార్మికుల హక్కులను కాలరాస్తున్న నోరు మెదపకపోవడం అన్యాయ మన్నారు. ఇదే వైఖరి కొనసాగితే నేపాల్‌లో, శ్రీలంకలో వచ్చిన విధంగా కార్మిక వర్గం తిరగబడే రోజులు వస్తా యని, ఈ విషయాన్ని పాలకవర్గాలు గుర్తుపెట్టుకొని వ్యవహరించాలన్నారు. కార్మిక సమస్యలను పరిష్కరిం చాలని, టిటిడిలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులందరినీ రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ సదస్సులో సిఐటియు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి ఎస్ జై చంద్ర, టి సుబ్రమణ్యం, ఉపాధ్యక్షులు జి బాలసుబ్రమణ్యం పాల్గొన్నారు.

ఘనంగా ముగిసిన బాలోత్సవం

సెల్ ఫోన్లకే పరిమితం కావొద్దు.. అన్ని రంగాల్లో రాణించండి : వక్తల హితవు



అభినందనలు

ప్రజాశక్తి - తిరుపతి టౌన్: ఈ తరం పిల్లలు సెల్ ఫోన్లు, యూట్యూబ్‌లకు పరిమితం కాకుండా పిల్లలు చదువుతోపాటు ఆటల పాటలు, క్విజ్, సాంస్కృతిక కార్యక్రమాల్లో దృష్టి పెట్టాలని పలువురు వక్తలు తెలిపారు. తిరుపతి ఎస్‌జిఎస్ డిగ్రీ కాలేజ్‌లో తిరుపతి బాలోత్సవం కార్యక్రమం రెండవ రోజు పలు కార్యక్రమాలు నిర్వహించారు. బాలోత్సవం వ్యవస్థాపకులు మల్లారపు నాగార్జున, గౌరవ అధ్యక్షులు టెంకాయల దామోదరం, ఏపీ చాంబర్ ఆఫ్ కామర్స్ రాష్ట్ర ఉపాధ్యక్షులు కెవి చౌదరి, హోటల్స్ అసోసియేషన్ నాయకులు మబ్బు సూర్యనారాయణ రెడ్డి మాట్లాడుతూ పిల్లలు సోషల్ మీడియా ప్రభావం వల్ల ఆటల పాటలు తగ్గిపోవడమే కాకుండా మన సంస్కృతి సాంప్రదాయాలను కూడా మర్చిపోతున్నారని, దీంతో సమాజానికి ఎంతో నష్టం కలుగుతుందని చెప్పారు. ముఖ్యంగా తల్లిదండ్రులు పట్ల గౌరవం మర్యాదలతో వ్యవహరించాలన్నారు. తెలుగు భాషపై మమకారం పెంచుకోవాలని కోరారు. బాలోత్సవానికి ప్రభుత్వ పాఠశాల విద్యార్థులతో పాటు ప్రైవేట్ పాఠశాల విద్యార్థులు కూడా పెద్ద సంఖ్యలో హాజరు కావడం తమకు ఆనందం కలిగిస్తుందన్నారు. పిల్లలు సమాజ సేవలో కూడా తమ వంతు భాగస్వాములు కావాల్సిన అవసరం ఉందన్నారు. బాలోత్సవ కమిటీ నెల రోజులపాటు శ్రమించి ఈ కార్యక్రమం నిర్వహించామని ఇది విజయవంతం కావడం తమకెంతో ఆనందం కలిగిస్తుందన్నారు. రాబోయే రోజుల్లో బాలోత్సవం మంరింత ఘనంగా చేస్తామని తెలిపారు. గత నాలుగు సంవత్సరాలుగా పిల్లల అభ్యున్నతి కోసం బాలోత్సవ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని పిల్లల తల్లితండ్రుల ఆదరాభిమానులు మర్చిపోలేమన్నారు. కార్యక్రమానికి జిల్లా వ్యాప్తంగా 12 వేల మంది హాజరయ్యారని తెలిపారు. ఏడాది బాలోత్సవంలో పత్రికా పఠణం, గజిబిజి సరి చేద్దాం క్విజ్‌తో పాటు ఇంకా అనేక కార్యక్రమాలు పిల్లలకు పరిచయం చేయడం జరిగిందన్నారు. విద్యార్థులు బలమైన కోరికలు ఎంచుకోవాలని అన్నారు. ఆదిశగా ప్రణాళిక రూపొందించుకొని ముందుకు వెళ్లాలని కోరారు. నిరంతర కృషి చేస్తే ఎలాంటి సమస్య అయినా అధిగమించవచ్చని చెప్పారు. తెలుగు భాషా ఉద్యమ సమితి నాయకులు శాకం నాగరాజు, తిరుపతి రోటరీ క్లబ్ అధ్యక్షులు ఎం హేమచంద్ర, బాలోత్సవం అధ్యక్షులు నడ్డి నారాయణ, కార్యదర్శి గురునాథం మాట్లాడుతూ పిల్లలు తల్లిదండ్రులు చెప్పినట్టు వినాలని అప్పుడే బంగారు భవిష్యత్తు బాటపడుతుందన్నారు. బాలోత్సవ కార్యక్రమం పిల్లలకి మంచి ప్రోత్సాహం కలిగిందన్నారు.



ప్రతి నిమిషం పిల్లలు తమకు అను కూలంగా మలుచుకొని అభివృద్ధి వైపు సాగాలని హితువు పలికారు. ఈ కార్యక్రమంలో విశ్వ శ్రీ సాహితి సమాఖ్య నాయకులు దామర్ల పాటి ధనుంజయ నాయుడు, అభినయన ఆర్ట్స్ నాయకులు బి వి రెడ్డి, హెల్పింగ్ టు అదర్స్ నాయకులు మణికంఠ బాలోత్సవకమిటీ సభ్యులు నెల్లూరు ముని లక్ష్మి, ఉపాధ్యాయులు, పిల్లల తల్లిదండ్రులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



బహుమతులు

అలరించిన శాస్త్రీయ నృత్యాలు..

బాలోత్సవం ముగింపు రోజు ఆదివారం పలు పాఠశాలలకు చెందిన విద్యార్థులు శాస్త్రీయ, జానపద నృత్యాలు, కోలాటాలు ప్రదర్శించారు. మట్టి బొమ్మల తయారు చేశారు. పర్యావరణ పరిరక్షణపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఇందులో జూనియర్స్, సబ్ జూనియర్స్ వేరువేరు విభాగాలు పిల్లలు పాల్గొన్నారు. 35 అంశాలు 77 విభాగాల్లో నిర్వహించిన పోటీలో గెలుపొందిన ప్రతిభావంతులకు ముఖ్య అతిథుల చేతుల మీదుగా ప్రశంస పత్రంతో పాటు అవార్డును అందజేశారు.



బాలోత్సవం వేడుకల్లో యోగా పోటీలు



ప్రజాశక్తి - తిరుపతి టౌన్: నాలుగోవ పిల్లల పండగ తిరుపతి బాలోత్సవ ఉత్సవాలు రెండవ రోజు ఆదివారం ఎస్‌జిఎస్ ఆర్ట్స్ కళాశాలలో ఘనంగా జరిగినాయి. ఈ కార్యక్రమంలో ఉయ్ సపోర్ట్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో యోగాసనాల పోటీలు నిర్వహించారు. ఉయ్ సపోర్ట్ చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకురాలు తహసునీసా బేగం మాట్లాడుతూ పిల్లలకు చిన్న వయసు నుండే ఆరోగ్యం పట్ల అవగాహన అవసరమని అందుకే తమ ఎల్లవేళలా పిల్లలకి యోగాసనాల పోటీలు పిల్లల బాలోత్సవంలో నిర్వహిస్తున్నామని తెలియజేశారు. ఈ పోటీలలో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల పిల్లలు పాల్గొన్నారు. విజేతలకు బహుమతులు అందచేశారు. ఈ పోటీలలో స్కూల్ టీచర్లు, తల్లిదండ్రులు పాల్గొన్నారు. తిరుపతి బాలోత్సవం దానికి అనుసంధానమై నిర్వహిస్తున్న సంస్థలకు నిర్వాహకులకు తల్లిదండ్రులు, టీచర్లు అభినందనలు తెలిపారు.

బుర్ర కథల పోటీల్లో నారాయణవనం విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : తిరుపతిలో ఎస్‌జిఎస్ కాలేజీలో నిర్వహిస్తున్న బాలోత్సవం కార్యక్రమంలో నారాయణవనం, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల బాలికలు బుర్రకథ పోటీల్లో ఉత్తమ ప్రతిభ చాటి, మొదటి బహుమతి అందుకున్నారు. విద్యార్థులకు శిక్షణ ఇచ్చిన తెలుగు ఉపాధ్యాయులు కందల శ్రీదేవికి, విజేతలకు పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు.



జోగి రమేష్ అరెస్ట్ అక్రమం

- మండల వైసీపీ నేత కిరణ్ యాదవ్



ప్రజాశక్తి - బుచ్చినాయుడు కండ్రిగ: మాజీ మంత్రి జోగి రమేష్ అక్రమ అరెస్టును, మండల వైసీపీ నేత కిరణ్ యాదవ్ తీవ్రంగా ఖండించారు. కిరణ్ యాదవ్ మాట్లాడుతూ బీసీ సమాజాన్ని భావోద్వేగానికి గురిచేసే ఘటన ఇదన్నారు. ఈ ప్రభుత్వం వచ్చాక ఏదైనా భారీ నష్టం జరిగితే దానిని దారి మళ్లించే కార్యక్రమం చేపడుతున్నారని ఆరోపించారు. ఒక పక్క తుఫాను వచ్చి రైతులు నష్టపోయారు, కాశీ బుగ్గ ఆలయంలో జరిగిన విషాదకర తొక్కిసలాటలో పదిమంది చనిపోయారు. దీనిని డైవర్ట్ చేయడానికి బీసీ నేత, మాజీ మంత్రి జోగి రమేష్‌పై అక్రమ కేసులు పెట్టి అరెస్ట్ చేయడం కుట్రపూరితమన్నారు. జోగి రమేష్ అరెస్ట్‌ను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. బీసీ హక్కులకు, సామాజిక న్యాయానికి కలిసికట్టుగా పోరాడతామని కిరణ్ యాదవ్ స్పష్టం చేశారు.

యువశ్రీ మురళికి తెలుగు సాహితీ పురస్కారం



ప్రజాశక్తి - బుచ్చినాయుడు కండ్రిగ: మండలంలోని కనమనంబేడు గ్రామానికి చెందిన కలివెట్టు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల తెలుగు ఉపాధ్యాయులు యువశ్రీ మురళి తెలుగు సాహితీ పురస్కారం అందుకున్నారు. ఆయన ఉపాధ్యాయుడుగా, కవిగా, రచయితగా, భాషోద్యమ నాయకుడుగా గుర్తింపు పొందారు. ఆదివారం పలమనేరులో తెలుగు సాహిత్య, సాంస్కృతిక సమితి ఆధ్వర్యంలో కళా మందిరంలో జరిగిన 13వ వార్షికోత్సవ కార్యక్రమంలో ఈ పురస్కారం అందుకున్నారు. అనంతరం సమితి అధ్యక్షులు తులసీనాదం నాయుడు, కార్యదర్శి పుష్ప, ముఖ్య అతిథులు ఆచార్య గార్లపాటి దామోదర నాయుడు, శతావధాని ఆముదాల మురళి తదితరుల చేతులమీదుగా సత్కారం పొందారు.

ఉబ్బలమడుగు గేట్లు మూసేయండి



ప్రజాశక్తి - బుచ్చినాయుడు కండ్రిగ: తుఫాన్ కారణంగా కురిసిన భారీ వర్షాలతో తిరుపతి జిల్లా, బుచ్చినాయుడు కండ్రిగ మండల పరిధిలోని ఉబ్బలమడుగు ప్రాజెక్టు నిండుకుండలా మారింది. చుట్టుపక్కల ప్రాంతాల నుంచి వరదనీరు భారీగా చేరడంతో అధికారులు డ్యాం గేట్లను తెరిచి నీటిని విడుదల చేశారు. అయితే, నీటి మట్టం తగ్గినప్పటికీ గేట్లను తిరిగి మూయకపోవడంతో వర్షపు నీరు ప్రస్తుతం వృధాగా సముద్రంలో చేరిపోతోంది. అధికారుల నిర్లక్ష్యంపై స్థానిక రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వ్యవసాయానికి ఉపయోగపడే నీరు వృధాకాకుండా గేట్లు మూసి నీటిని భద్రపరచాలని కోరారు.

మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ అడ్డుకుంటాం



ప్రజాశక్తి - బుచ్చినాయుడు కండ్రిగ: వైసీపీ అధ్యక్షులు జగన్ మోహన్ రెడ్డి పిలుపుమేరకు బుచ్చినాయుడు కండ్రిగ మండలం వైయస్సార్సీపీ కన్వీనర్ మణి నాయుడు ఆధ్వర్యంలో మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ వ్యతిరేకంగా కోటి సంతకాల సేకరణ కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. సత్యవేడు నియోజకవర్గ సమన్వయకర్త నూకతోటి రాజేష్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. మొదటిగా కంచన పుత్తూరులో వైసీపీ నాయకుడు గురవయ్య ఆధ్వర్యంలో సంతకాల సేకరణ నిర్వహించారు. అనంతరం బుచ్చినాయుడు కండ్రిగ మండలం సర్పంచులతో సంతకాల సేకరణ చేపట్టారు. వైసీపీ నాయకుల ప్రతి ఇంటికి వెళ్లి కరపత్రాలు పంపిణీ చేశారు. ప్రైవేటీకరణతో ఎంబీబీఎస్ చదవాలంటే 5 నుంచి 6 కోట్ల రూపాయలు కావాల్సి వస్తుందని, దీంతో పేదలకు ఎంబీబీఎస్ విద్య దూరమవుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైయస్సార్సీపీ ఉమ్మడి చిత్తూరు జిల్లా మీడియా విభాగం అధ్యక్షులు ఏలూరు రాకేష్, రాష్ట్ర ఎస్ఎస్ఎల్ గురునాథం, సాయి నాయుడు, జయచంద్ర నాయుడు, దేవదాస్ ప్రసాద్, వెంకటేష్, సురేష్, కోటేశ్వర్ నాయుడు, కిరణ్ యాదవ్, శివా, డ్రైవర్ ఆనంద్ రాజశేఖర్, వైసీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

స్పాట్స్ అండ్ గైడ్స్ ఫౌండేషన్ డే



ప్రజాశక్తి - పుత్తూరు టౌన్: స్కౌట్స్ అండ్ గైడ్స్ రాష్ట్ర కార్యదర్శి ఆర్ నరసింహా రావు ఆదేశాల మేరకు జిల్లా చీఫ్ కమిషనర్, జిల్లా విద్యాశాఖ అధికారి కె.వి.ఎన్ కుమార్ అనుమతితో, స్కౌట్స్ అండ్ గైడ్స్ ఫౌండేషన్ డే ఆదివారం ఘనంగా నిర్వహించారు. పుత్తూరు, పరిసర ప్రాంతాల్లోని స్కౌట్ అండ్ గైడ్ డివిజనల్ స్థాయి ట్రైనింగ్ సెంటర్లో ఫౌండేషన్ డే ప్రాముఖ్యత గురించి వివరించారు. ఫ్లాగ్ డేను ప్రతి పాఠశాలలో నిర్వహించాలని మోటివేట్ చేశారు. ఈ కార్యక్రమంలో స్కౌట్ జిల్లా ఇన్చార్జ్ కార్యదర్శి విజయకుమార్, డిస్ట్రిక్ట్ ఆర్గనైజింగ్ కమిషనర్ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు పంపిణీ

ప్రజాశక్తి - నాగలాపురం: మండల పరిధిలోని నాగలాపురంలో గాంధీ వీధికి చెందిన టిడిపి కార్యకర్త భాస్కర్ కుమారుడు అజిత్(25) తన రెండు కిడ్నీలు చెడిపోవడంతో అనారోగ్యంతో బాధపడుతూ మృతి చెందాడు. బాధిత కుటుంబానికి ఆదివారం సత్యవేడు నియోజకవర్గ కో ఆర్డినేటర్ కూరపాటి శంకర్ రెడ్డి చేతుల మీదుగా మృతుని తల్లి దండ్రులకు రూ.5,51,777/- సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు పంపిణీ చేశారు.

టెట్ నుండి మినహాయింపు ఇవ్వాలి

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులకు టెట్ నుండి మినహాయింపునివ్వాలని ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షులు మురళీకృష్ణ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఏపీటీఎఫ్ జిల్లా కౌన్సిల్ సమావేశం ఆదివారం నిర్వహించారు. 12వ పీఆర్సీ కమిషన్ నియమించి 30 శాతం మధ్యంతర భృతి ఇవ్వాలని, పెండింగ్ బకాయిలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. వెంకటాద్రి, వెంకట మునీ, హరి తదితరులు పాల్గొన్నారు.

నేడు ఉచిత కంటి వైద్య శిబిరం

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్: ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ జీవిత కాల సభ్యులు, ఏఎస్ఐ చల్లా మునిక్రిష్ణయ్య వారి సౌజన్యంతో సోమవారం తహశీల్దార్ కార్యాలయం ఆవరణలో వాసన్ ఐ కేర్ హాస్పిటల్ వారిచే కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు చల్లా ముని కృష్ణయ్య తెలిపారు.

స్పార్క్ ఆఫ్ ది ఇయర్‌గా సంజయ్ ఆచారి



సంజయ్ ఆచారిని అభినందిస్తున్న కళాశాల డైరెక్టర్లు విశ్వనాథ్, గిరిధర్

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): తిరుపతి, ఎమరాల్డ్స్ డిగ్రీ కళాశాలలో ప్రథమ సంవత్సరం డిగ్రీ కోర్సుల విద్యార్థులకు ఆంగ్లభాష సామర్థ్యాన్ని పెంచి ఉన్నత విద్య ఉపాధి అవకాశాలు పెంపొందించాలనే ఉద్దేశంతో కాన్ఫ్లుయన్స్ పేరిట వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టామని ఎమరాల్డ్స్ కళాశాల డైరెక్టర్లు విశ్వనాథ్, గిరిధర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఫిక్షన్ డిక్షన్, టాక్ టాక్, లిజన్ అప్, ఇంక్రాఫ్ట్ తదితర పోటీలు నిర్వహించామన్నారు. ఈ సందర్భంగా కళాశాల డైరెక్టర్లు విశ్వనాథ్, గిరిధర్‌లు కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడుతూ తమ విద్యార్థులు ఈ పోటీ ప్రపంచంలో ఉన్నతశిఖరాలను అధిరోహించడానికి ఇలాంటి పోటీలు ఎంతగానో దోహదపడతాయన్నారు. టాక్ ది టాక్ లో యోగ విఘ్నరాజ్, ఫిక్షన్ డిక్షన్ లో సంజయ్ ఆచారి, రాహితి, ఇన్క్ క్రాఫ్ట్ లో శ్రీవంత్, జారాహబీబా, లిజన్ అప్ లో మన్వితసాయి, శిరీష ప్రథమ, ద్వితీయ స్థానాలు సాధించారన్నారు. ఈ పోటీలలో స్పార్క్ ఆఫ్ ది ఇయర్ గా సంజయ్ ఆచారి నిలిచాడని తెలిపారు. ఈ కార్యక్రమములో కళాశాల అసిస్టెంట్ డైరెక్టర్ మునిరత్నం, జానకిరామ్, శ్రీనివాసులు, నాథముని, ప్రిన్సిపాల్ జాఫర్, అధ్యాపకురాలు వసుంధర, భానుశ్రీ, రమేష్, భానుకిరణ్, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణ జీవోను వెనక్కు తీసుకోండి

ప్రజాశక్తి - తిరుపతి (మంగళం): మెడికల్ కళాశాలను ప్రైవేటీకరణ చేయాలనే ఉద్దేశంతో కూటమి ప్రభుత్వం జీవో ఇచ్చిందని, దానిని వెంటనే వెనక్కు తీసుకోవాలని మాజీ రాజ్యసభ సభ్యులు తులసి రెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం తిరుపతి ప్రెస్ క్లబ్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పేద ప్రజలకు ఈ మెడికల్ కళాశాల ద్వారా వైద్య సదుపాయాలు అందుతాయని, పులివెందులలో కళాశాల, నర్సింగ్ కళాశాల 100 శాతం మేర పూర్తి అయ్యాయని, దీంతో 2024-25 విద్యా సంవత్సరానికి గాను నేషనల్ మెడికల్ కమిషన్ 50 సీట్లను మంజూరు చేస్తే, మా వద్ద తగిన వనరులు లేవంటూ చంద్రబాబు కేంద్రానికి లేఖ రాశారన్నారు. ఇది చాలా దారుణమైన విషయమని, ఎక్కడైనా పేద విద్యార్థులకు వైద్య విద్యను అందించడానికి మరిన్ని సీట్లు అడగాల్సింది పోయి, వద్దని లేఖలు రాయడం మంచి పద్ధతి కాదని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్ర బడ్జెట్లో కేవలం రూ.6 కోట్ల రూపాయలు వెచ్చిస్తే, 17 మెడికల్ కళాశాలలు నిర్మాణాలు పూర్తి చేసుకుని అందుబాటులోకి వస్తాయని, ఇంకో ప్రత్యామ్నాయంగా నాబార్డ్ నిధులు ఇవ్వడానికి కూడా సంసిద్ధంగా ఉందని తెలిపారు. అయినా కూటమి ప్రభుత్వం ఈ దిశగా ఆలోచన చేయకపోతే రానున్న రోజుల్లో ప్రజాగ్రహానికి గురికాక తప్పదని హెచ్చరించారు. ఈ విలేకరుల సమావేశంలో కాంగ్రెస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు రాంభూపాల్ రెడ్డి, తిరుపతి జిల్లా అధ్యక్షులు బాలగురవం బాబు, కాంగ్రెస్ పార్టీ చంద్రగిరి నియోజకవర్గ ఇన్చార్జి ఐరాల లోకేష్ రెడ్డి, శివబాలాజీ, జ్యోతీశ్వర్ నాయక్, కృష్ణమూర్తి పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికురాలికి సన్మానం

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరు మున్సిపాలిటీలో ఎన్నో సంవత్సరాలుగా ఔట్ సోర్సింగ్ పారిశుధ్య మహిళా కార్మికురాలు గా ఐదవ సచివాలయం పరిధిలో విధులు నిర్వహిస్తున్న మందా రామమ్మ అక్టోబరు 31 తేదీన పదవి విరమణ చేసింది. ఏ.పీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ (సి.ఐ.టి.యు) అనుబంధం ఆధ్వర్యంలో పారిశుద్ధ్య కార్మికులు ఆదివారం స్థానిక సిఐటియు కార్యాలయంలో రామమ్మను భూలోక మురళి అధ్యక్షతన ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో గూడూరు మున్సిపల్ కార్మిక సంఘం గౌరవాధ్యక్షులు జోగి శివకుమార్, ఏ.పీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు దారా కోటేశ్వరరావు, వడ్డిపల్లి చెంగయ్య, గూడూరు పట్టణ సి.ఐ.టి.యు ప్రధాన కార్యదర్శి బి.వి.రమణయ్య, గూడూరు మున్సిపల్ కార్మిక సంఘం సహాయ అధ్యక్షులు యన్. వెంకటరమణ, సహాయ కార్యదర్శి ఏ.శాంతి వర్ధన్, జి.మని,పి.పి పెంచల ప్రసాద్, శ్రీనివాసులు, మహిళా కార్మికులు పద్మమ్మ, నారాయణమ్మ,పెంచలమ్మ తదితరులు పాల్గొన్నారు.

తూముగుంట చెరువుకు గండి.. వృధాగా పోతున్న నీరు

ప్రజాశక్తి - చిన్నగొట్టిగల్లు: స్థానిక దేవరకొండ పంచాయతీలోని తూముగుంట చెరువుకు శనివారం రాత్రి గండి పడిందని, అధికారులు సత్వరం చర్యలు చేపట్టాలని, గ్రామస్తులు కోరారు. ఆదివారం ఉదయానికి గండి పడ్డ ప్రాంతంలో రాను రాను గండి మరింత ఎక్కువగా పెరిగి భారీ స్థాయిలో చెరువు నీరు మొత్తం వృధా గావెళుతుందని ఆవేదన వ్యక్తం చేశారు.

దుస్తులు వితరణ

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరు, డిఎన్ఆర్ కమ్యూనిటీ హాల్‌లో లయన్స్ క్లబ్ ఆఫ్ గూడూరు వైజెపీ, టౌన్ అండ్ వెస్ట్ క్లబ్స్ సేవ కార్యక్రమాలలో భాగంగా స్వర్గీయ సూరబత్తిన సుబ్రహ్మణ్యం జయంతి సందర్భంగా 30 మంది వికలాంగులకు దుస్తులు ను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వైస్ డిస్ట్రిక్ గవర్నర్ ఎంజేఫ్ఆర్వీ రావు, వైజెపీ క్లబ్ అధ్యక్షుడు సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

నారా రోహిత్ దంపతులకు గంగమ్మ ప్రసాదాలు

ప్రజాశక్తి - తిరుపతి సిటీ: నారావారిపల్లెకు విచ్చేసిన సినీ హీరో నారా రోహిత్, సిరి లీలా దంపతులకు ఆదివారం శాప్ చైర్మన్ అనిమిని రవి నాయుడు, తిరుపతి తాతయ్య గుంట గంగమ్మ గుడి చైర్మన్ నైనార్ మహేష్ యాదవ్‌లు తాతయ్య గుంట గంగమ్మ అమ్మవారి తీర్థప్రసాదాలను అందజేసి, అమ్మవారి చిత్రపటాన్ని బహుకరించారు. అనంతరం నారా రోహిత్ దంపతులను శాలువతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీఎన్ఎస్ఎఫ్ తిరుపతి పార్లమెంట్ అధ్యక్షులు కొట్టే హేమంత్ రాయల్, తెలుగు యువత నాయకులు రంజిత్ కుమార్, ప్రకాష్, మధు, లోకేష్ తదితరులు పాల్గొన్నారు.

నూతనఉపాధ్యాయులకు అభినందన

ప్రజాశక్తి -కోట, వాకాడు : శ్రీ సీతారామ ధార్మిక సేవా సంస్థ ఆధ్వర్యంలో వాకాడు మండలం, బాలిరెడ్డిపాళెంలోని శ్రీ పట్టాభి రామాలయంలో నూతనంగా ఉపాధ్యాయులుగా ఎంపికైన వారిని ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆలయ ధర్మకర్త కొడవలూరు దామోదర రెడ్డి విచ్చేశారు. ఈ కార్యక్రమంలో శ్రీరామసేన అధ్యక్ష కార్యదర్శులు కొడవలూరు హరీష్ రెడ్డ, పోలిపాటి శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్లు ప్రారంభం

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : వడమాల పేట, తిరుమండ్యం పంచాయతీ, తిరుమండ్య మెయిన్ రోడ్డు నుండి టిఆర్ కండ్రిగ వరకు దాత ఎంఆర్‌సి రాజు రూ.10 లక్షల సొంత నిధులతో సీసీ రోడ్డు నిర్మాణం చేయించారు. ప్రభుత్వం నిధులతో టిఆర్ కండ్రిగ వరకు 8 లక్షల రూపాయలు, తిరుమండ్యం పంచాయతీ టిఆర్ కండ్రిగ ఏ ఏ డబ్ల్యూ రూ. 8 లక్షలతో, టి ఆర్ కండ్రిగ సీసీ రోడ్డు, రూ.16 లక్షలు ప్రభుత్వ నిధులతో సీసీ రోడ్డు నిర్మాణం పనులు పూర్తి చేశారు. వాటిని ఎమ్మెల్యే గాలి భాను ప్రకాష్ చేతుల మీదుగా ఆదివారం ప్రారంభించారు.

మఠం పునర్నిర్మాణ నిర్ణయంపై హర్షం

ప్రజాశక్తి - తిరుపతి (మంగళం): హథీరాం బావాజీ మఠం భవనాన్ని పునర్నిర్మాణం చేస్తామని, ఆధ్యాత్మిక సంపదను కాపాడుతామని జిల్లా కలెక్టర్ ప్రకటించడంపై తిరుపతి నగరపాలక సంస్థ 25వ డివిజన్ కార్పొరేటర్ నరసింహచారి హర్షం వ్యక్తం చేశారు. ఆదివారం తిరుపతి ప్రెస్ క్లబ్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పురాతనమైన సంపదను కాపాడాలని, ఎన్నో పోరాటాలు చేశానన్నారు. మఠం భవనాన్ని ఆనుకుని ఉన్న దుకాణదారులకు ఎటువంటి నష్టం వాటిల్లకుండా, వారి వ్యాపారాలకు అవరోధాలు కలుగకుండా ప్రభుత్వం దృష్టికి జిల్లా ఇన్చార్జి మంత్రి అనగాని సత్యప్రసాద్ ద్వారా తీసుకెళ్లడం జరిగిందన్నారు. మఠం విషయంలో వెంటనే స్పందించి సత్వర చర్య తీసుకోవాలని సీఎం సూచించడంతో పునర్నిర్మాణానికి అడుగులు పడ్డాయన్నారు. 90 శాతం మంది చిన్న వ్యాపారులు నిజాయితీగా వ్యాపారాలు చేసుకుంటున్నారని, పది శాతం మంది రాజకీయ పలుకుబడితో మఠం వారికి అద్దెలు చెల్లించ లేదన్నారు. అటువంటి వారిపై మఠం అధికారులు చర్యలు తీసుకుంటే మద్దతుగా నిలుస్తామన్నారు. ఈ విలేకరుల సమావేశంలో 25వ డివిజన్ ప్రజలు పాల్గొన్నారు.

తుడా చైర్మన్‌ను కలిసిన వైకుంఠం జ్యోతి



ప్రజాశక్తి - తిరుపతి టౌన్: కర్నూలు జిల్లా, ఆలూరు నియోజకవర్గ తెదేపా ఇంచార్జి వైకుంఠం జ్యోతి తిరుమలలో ఆదివారం తుడా చైర్మన్ తితిదే ఎక్స్ అఫిషియో మెంబర్ డాలర్స్ దివాకర్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా తుడా పరిధిలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాల గురించి చర్చించారు.

భారత మహిళా క్రికెట్ జట్టు విజయం కోసం పూజలు

ప్రజాశక్తి -తిరుపతి టౌన్: భారత మహిళా క్రికెట్ జట్టు దక్షిణాఫ్రికా మధ్య వరల్డ్ కప్ ఫైనల్ మ్యాచ్ సందర్భంగా తుడా ఛైర్మన్, తితిదే ఎక్స్ అఫిషియో మెంబర్ డాలర్స్ దివాకర్ రెడ్డి తిరుమల శ్రీవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ,"భారత మహిళా క్రికెట్ జట్టు ఈ రోజు దక్షిణాఫ్రికాతో ఫైనల్ పోటీలో తలపడుతోందన్నారు. ఈ స్థాయికి చేరుకోవడం జట్టు కృషి, క్రమశిక్షణ, క్రీడాస్ఫూర్తికి నిదర్శనం. మ్యాచ్ ఫలితమేమైనా, వారి ప్రదర్శన భారత క్రీడా చరిత్రలో గర్వకారణం అవుతుందని తెలిపారు. యువత క్రీడలవైపు ఆకర్షితులు కావాలని, మహిళలు ప్రతి రంగంలో ప్రతిభ చాటుతున్నారన్నారు. భారత జట్టు విజయం సాధించాలని ఆకాంక్షిస్తూ, ఆటగాళ్లు, కోచ్‌లు, సపోర్ట్ స్టాఫ్ అందరికీ ఆయన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర క్రికెట్ అసోసియేషన్ జాయింట్ సెక్రటరీ విజయ్ కుమార్, ఉమ్మడి చిత్తూరు జిల్లా సెక్రటరీ సతీష్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ఆషా ఆధ్వర్యంలో వరద సాయం

ప్రజాశక్తి - రేణిగుంట : రేణిగుంట మండలం, కొత్తపాలెం, ఎస్టీ కాలనీ గిరిజనులు ఇటీవల కురిసిన భారీ వర్షాలకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. వారి దీన పరిస్థితి చూసి స్పందించిన ఆషా స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షుడు జూలియన్ రాజు ఆధ్వర్యంలో అమెజాన్, డొనేట్కార్ట్ సౌజన్యంతో బియ్యం, దుప్పట్లు, పది రకాల నిత్యావసర సరుకులను ఆదివారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆషా సంస్థ ముఖ్య సలహాదారులు అమ్ములు రాజు, సిబ్బంది శ్రీనివాసులు, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

అప్సా ఆధ్వర్యంలో విద్యార్థులకు సన్మానం



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న తిరుపతి జిల్లా విద్యాశాఖ అధికారి కెవిఎన్ కుమార్

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): ఆంధ్ర ప్రదేశ్ ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్ తిరుపతి జిల్లా ఆధ్వర్యంలో 2024-25 విద్యా సంవత్సరం 10వ తరగతిలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన 140 మంది విద్యార్థు లను ఆదివారం ఓ ప్రైవేటు ఫంక్షన్ హాల్‌లో జిల్లా విద్యాశాఖ అధికారి కెవిఎన్ కుమార్ ఘనంగా సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో అప్సా రాష్ట్ర అధ్యక్షులు సుబ్రమణ్యం రాజు, గేట్ విద్యాసంస్థల అధినేత తమ్మినేని వెంకటేశ్వర్లు, తిరుపతి, పుత్తూరు ఉప విద్యాశాఖ అధికారులు ఇందిరాదేవి, మహేశ్వరరావు, అప్సా తిరుపతి జిల్లా అధ్యక్షులు ఎల్.రమేష్ బాబు, కార్యదర్శి పి.లోకేష్, విద్యాసంస్థల అధినేతలు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత.. అందరి బాధ్యత



లోతువానిగుంట నివాసితులకు సూచనలిస్తున్న మున్సిపల్ కమిషనర్ షేక్ ఫజులుల్లా

ప్రజాశక్తి - నాయుడుపేట: పట్టణంలోని పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యతని మున్సిపల్ కమిషనర్ ఎస్.కే.పజిలుల్లా అన్నారు. ఆదివారం మున్సిపల్ కమిషనర్ తమ సిబ్బందితో కలిసి నాయుడుపేటలోని లోతువానుగుంట పరిసర ప్రాంతాల్లో పర్యటించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాయుడుపేట మున్సిపాలిటీ పరిధిలోని ప్రజలు తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకొని,పారిశుద్ధ్యన్ని మెరుగుపరిచేందుకు సహకరించాలని నాయుడుపేట మున్సిపల్ కమిషనర్ షేక్ ఫజులుల్లా ప్రజలకు తెలియజేశారు.తాగునీటి సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని సిబ్బందికి సూచించారు.ప్రజలు మురికినీటి కాలవలో ప్లాస్టిక్ కవర్లు,చెత్తాచెదారాలు వేయరాదన్నారు. మునిసిపాలిటీ వారు ప్రజలకు అందజేసిన మూడు రంగుల డబ్బాలలో తడి చెత్త,పొడి చెత్త ను వేరు చేసి ఇళ్ల వద్దకు వచ్చే పారిశుధ్య కార్మికులకు అందించాలని సూచించారు.పారిశుద్ధ్య కార్మికుల శ్రమతోపాటు ప్రజల సహకారం ఉంటేనే పరిసరాలు పరిశుభ్రంగా ఉంటాయని తద్వారా దోమలు వృద్ధి చెందకుండా ఉంటాయని, వాటి వల్ల వ్యాప్తి చెందే విష జ్వరాలు మలేరియా వంటి వాటిని అదుపు చేయచ్చని తెలియజేశారు.

తోపుడు బండ్ల వ్యాపారస్తులకు గుర్తింపు కార్డులివ్వాలి

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : పట్టణంలో తోపుడు బండ్ల వ్యాపారులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలని, అక్రమ గేటు వసూళ్లకు అరికట్టాలని హాకర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి బుజ్జి, సిఐటియు జిల్లా కార్యదర్శి వెంకటేష్‌లు డిమాండ్ చేశారు. పుత్తూరు సిఐటియు కార్యాలయంలో ఆదివారం హకర్స్ యూనియన్ కమిటీ సమావేశం నవీన్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. తోపుడు బండ్ల వ్యాపారస్తుల సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని, పుత్తూరులో మున్సిపాలిటీలో మాన్యువల్ ప్రకారంగా గేటు వసూలు చేయాలని డిమాండ్ చేశారు, కార్మికులకు భద్రత కల్పించాలన్నారు. ఈఎస్ఐ, పీఎఫ్ వంటి సౌకర్యాలు కల్పించాలన్నారు. అనంతరం పుత్తూరు తోపుడు బండ్ల వ్యాపారస్తుల సంఘం నూతన కమిటీని ఎన్నుకున్నారు. నూతన అధ్యక్షులుగా ఎం నజీర్, నూతన ప్రధాన కార్యదర్శిగా ఎస్ నవీన్, కోశాధికారిగా భువనేశ్వరి, ఉపాధ్యక్షులుగా అంకయ్య, అజిత్, సహాయ కార్యదర్శులుగా ఎం అను బాబు, ఎం తిరుమలయ్య, కమిటీ సభ్యులుగా కె హరి, గోపాల్, ఎస్ గురవమ్మ, వి రాధలను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు కార్యదర్శి మునిరాజా, ఎన్ శ్రీనివాసులు, పుత్తూరు పట్టణ సిఐటియు కార్యదర్శి ఏ విజయ్, నర్సింలు, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా విజిలెన్స్ అవేర్నస్ వీక్

ప్రజాశక్తి - క్యాంపస్ : జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయం తిరుపతిలోని రమారంజన్ ముఖర్జీ ఆడిటోరియంలో విజిలెన్స్ అవేర్నెస్ వీక్ -2025 సమాపన కార్యక్రమము ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యాతిథి శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయం రెక్టార్ ప్రొ.సి.హెచ్.అప్పారావు, విశిష్టాతిథిగా తుడా చైర్మన్ సి.దివాకర్ రెడ్డి విచ్చేసి విశ్వవిద్యాలయం వైస్-చాన్సలర్ ప్రొ.జి.యస్.ఆర క్రిష్ణమూర్తి, అకడమిక్ డీన్ ప్రొ.రజనీకాంత్ శుక్ల, ఛీఫ్ విజిలెన్స్ ఆఫీసర్ ప్రొ.సత్యనారాయణాచార్యతో కలిసి అవినీతిని ఏవిధంగా నివారించాలి అనే విషయం పై విద్యార్థులుకు వివరించారు. ఈ సందర్భంగా విశిష్టాతిథిగా తుడా చైనర్మన్ సి.దివాకర్ రెడ్డి మాట్లాడుతూ అవినీతి నిరోధక అవగాహన వారోత్సవం ప్రత్యేకించి సమాజాన్ని ఏవిధంగా అవినీతి రహితంగా నిర్మించాలో, అవినీతి రహిత సమాజ నిర్మాణంలో భారతదేశ వెన్నెముక అయిన యువత ప్రాత్ర మొదలగు విషయాలను వివరించారు. ఈ కార్యక్రమంలో కో-ఆర్డినేటర్ డా.ఎ.చారుకేష్, అడిషనల్ కో-ఆర్డినర్ డా.ఎ.శేఖర్ రెడ్డి, చీఫ్ విజిలెన్స్ ఆఫీసర్ ప్రొ.సత్యనారాయణాచార్య, అకడమిక్ డీన్ ప్రొ.రజనీకాంత్ శుక్ల, విభిన్న విభాగాల అధ్యాపకులు, రీసెర్చ్ స్కాలర్స్, విద్యార్థులు పాల్గొన్నారు.

నారావారిపల్లెలో నారా రోహిత్ సందడి



ప్రజాశక్తి - చంద్రగిరి : సినీ నటుడు చంద్రగిరి మండలం, నారావారిపల్లెకు ఆదివారం సతీసమేతంగా విచ్చేశారు. గ్రామస్తులను ఆప్యాయంగా పలకరించి, తన శ్రీమతి శిరీషను పరిచయం చేసారు. అనంతరం తాత అవ్వలు నారా ఖర్జుర నాయుడు, అమన్నమ్మ, తండ్రి నారా రామ్మూర్తి నాయుడుకి నివాళులు అర్పించారు. తిరిగి హైదరాబాద్‌కు ప్రయాణమయ్యారు.

సెవెన్ హిల్స్ ఫార్మసీలో సంగీత పోటీలు

ప్రజాశక్తి - రామచంద్రాపురం: సంగీతానికి రాళ్ళను సైతం కలిగించే సామర్థ్యం ఉందని భారత వికాస్ పరిషత్ జాతీయ ప్రధాన కార్యదర్శి డిడి శర్మ పేర్కొన్నారు. రామచంద్రాపురం మండలం, వెంకటరామాపురంలోని సెవెన్ హిల్స్ ఫార్మసీ కళాశాలలో ఆదివారం భారత్ వికాస్ పరిషత్ దక్షిణ భారతస్థాయి పాటల పోటీలను జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా తిరుపతి రాష్ట్రీయ విద్యాపీఠం వైస్ ఛాన్సర్ ప్రొఫెసర్ జి ఎస్ ఆర్ కృష్ణమూర్తి, శ్రీ వెంకటేశ్వర వేద విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సర్ ప్రొఫెసర్ రాణి సదాశివమూర్తిలు మాట్లాడుతూ భారతీయ సంగీతానికి ప్రపంచ స్థాయిలో గొప్ప ప్రత్యేకత ఉందన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీ వేంకటేశ్వర ఆయుర్వేద మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ రేణు దీక్షత్, దక్షిణ భారత్ వికాస్ తిరుపతి ప్రాంత అధ్యక్షులు డాక్టర్ నిరంజన్ బాబు, తిరుపతి ప్రాంత జనరల్ సెక్రటరీ శ్రీధర్ పిళ్లై, ఫైనాన్స్ సెక్రటరీ సుంకు వేణుగోపాల్, పెద్ద ఎత్తున సంగీత విధ్వంసులు పాల్గొన్నారు.

క్రైం న్యూస్

గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం కలకలం



ప్రజాశక్తి-వరదయ్యపాలెం : గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం మండలంలో కలకలం రేపింది. పోలీసులు అందించిన వివరాల మేరకు ఆదివారం నాగనందాపురం సమీపంలోని తెలుగు గంగ కాలువలో ఒక గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం ఉన్నట్లు స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న స్థానిక ఎస్సై మల్లికార్జున్ మృతదేహాన్ని పరిశీలించి మృతుని వివరాలకోసం ప్రయత్నం చేశారు. వివరాలు తెలిసిన వారు తమకు తెలపాలని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

అసభ్య ప్రవర్తన.. బైక్ రైడర్ అరెస్ట్

ప్రజాశక్తి - తిరుపతి సిటీ: ర్యాపిడో బైకర్ బలవంతంగా మహిళ జుట్టు పట్టుకుని ముద్దు పెట్టుకున్న ఘటన నగరంలో చోటు చేసుకువంది. మహిళ అరుపులు విని స్థానికులు నిందితుడికి దేహశుద్ధి చేసి పోలీసులుకు అప్పగించారు. పోలీసుల కథనం మేరకు రాపిడ్ బైక్ బుక్ చేసుకుని వెళుతున్న మహిళ పట్ల బైక్ డ్రైవర్ పెద్దయ్య అసభ్యంగా ప్రవర్తించి, బలవంతంగా ముద్దు పెట్టుకున్నాడు. మహిళా గట్టిగా కేకలు వేయడంతో స్థానికులు అతనికి దేహశుద్ధి చేసి అలిపిరి పోలీసులకు అప్పగించారు. రాత్రి విధుల్లో ఉన్న అలిపిరి సీఐ రామకిషోర్ నిందితుడు పెద్దయ్యను అదుపులోకి తీసుకుని, బైన్డోవర్ కేసు నమోదు చేసి తహశీల్దార్ ఎదుట ప్రవేశపెట్టారు. మండల మెజిస్ట్రేట్ పెద్దయ్యకు కౌన్సిలింగ్ ఇచ్చి సంవత్సరం పాటు సత్ప్రవర్తనతో మెలగాలంటూ హెచ్చరించారు.

హస్తకళా ఉత్పత్తులను ఆదరించండి

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): కళాసృష్టి స్వచ్ఛంద సేవా సంస్థ, కేంద్ర టెక్స్టైల్స్ జౌళి శాఖ సంయుక్త ఆధ్వర్యంలో ఈనెల 3 నుండి 9వ తేదీ వరకు శిల్పారామం వేదికగా గాంధీ శిల్ప్ బజార్ 2025ను నిర్వహిస్తున్నట్లు కళాసృష్టి స్వచ్ఛంద సేవా సంస్థ కార్యదర్శి డాక్టర్ దశరథరాచారి తెలిపారు. ఆదివారం తిరుపతి ప్రెస్ క్లబ్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశవ్యాప్తంగా ఈ గాంధీ శిల్ప్ బజార్ హస్తకళల ఉత్పత్తుల ప్రదర్శనకు 40 మంది కళాకారులు రూపొందించిన వివిధ రకాలైన వస్త్రాలు ప్రదర్శింపబడతాయన్నారు.నగర ప్రజులు హస్తకళల ప్రదర్శనను ఆదరించాలని విజ్ఞప్తి చేశారు.

రోహిత్ దంపతులను ఆశీర్వదించిన మల్లికార్జున నాయుడు

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: సినీ నటుడు నారా రోహిత్, శిరీష దంపతులను ఆదివారం ఎంజీఎం సంస్థలు అధినేత గుడ్లూరు మల్లికార్జున నాయుడు ఆశీర్వదించారు. నూతన దంపతులు స్వగ్రామం నారావారి పల్లికి రాగా మల్లికార్జున నాయుడు మర్యాదపూర్వ కలిసి వారిని ఆశీర్వదించారు.

వైభవంగా కైశిక ద్వాదశి ఆస్థానం



ప్రజాశక్తి - తిరుమల: కైశిక ద్వాదశి పర్వదినాన్ని పురస్కరించుకొని శ్రీవారి ఆలయంలో ఆదివారం కైశిక ద్వాదశి ఆస్థానం వేడుకగా జరిగింది. ఈ సందర్భంగా వేకువ ఝామున 4.30 నుండి 5.45 గంటల వరకు శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ ఉగ్రశ్రీనివాసమూర్తి ఆలయ మాడ వీధుల్లో భక్తులకు దర్శన మిచ్చారు. స్నపనబేరంగా పిలిచే ఉగ్రశ్రీనివాసమూర్తిని శ్రీదేవి భూదేవి సమేతంగా ఒక్క కైశిక ద్వాదశి రోజు మాత్రమే సూర్యోదయానికి ముందు మాడవీధులలో ఊరేగిస్తారు. అనంతరం స్వామి, అమ్మవార్లను బంగారు వాకిలి చెంత వేంచేపు చేసి అర్చకులు పురాణ పఠనంతో కైశిక ద్వాదశి ఆస్థానాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు.ఈ సందర్భంగా టీటీడీ ఈవో అనిల్ కుమార్ సింఘాల్ మీడియాతో మాట్లాడుతూ ఏడాదికోసారి కైశిక ద్వాదశి ఆస్థానం నిర్వహించడం ఆనవాయితీగా వస్తోందన్నారు. భక్తులందరికీ స్వామివారి కృపా కటాక్షాలు కలగాలని ప్రార్థించినట్లు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో తిరుమల చిన్నజీయర్‌స్వామి, డిప్యూటీ ఈఓ లోకనాథం, ఇతర అధికారులు పాల్గొన్నారు.

జోగికి తగిన శాస్తి జరిగింది

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: నకిలీ మద్యం కేసులో తీవ్ర ఆరోపణలు ఎదుర్కొంటున్న వైసీపీ మాజీ మంత్రి జోగి రమేష్ అరెస్టు కావడంపై టిడిపి బీసీ విభాగం రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డాక్టర్ ఎం ఉమేష్ రావు ఆదివారం హర్షం వ్యక్తం చేశారు. జోగికి తగిన శాస్తి జరిగిందనీ, సమగ్ర విచారణ జరిపి కఠిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. నేరం చేసి, కూటమి ప్రభుత్వంపై రుద్దేయాలన్న జోగి ఆశలపై సిట్ నీళ్లు చెల్లిందని ఎద్దేవా చేశారు. జోగి రమేష్ నకిలీ మద్యం కుట్ర ఆధారాలు సిట్ వద్ద ఉన్నాయనీ, జైలు తప్పదని హెచ్చరించారు. నకిలీ మద్యం విషయంలో కూటమి ప్రభుత్వాన్ని ఇరుకున పెట్టాలన్న జగన్ పాచికలు పారవనీ, ప్రజలు విశ్వసించరని స్పష్టం చేశారు. మిన్నల్ రవి, భాస్కర్, వజ్రం కిషోర్, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

ప్రోటోకాల్ ఉల్లంఘనపై ఆదిమూలం అసహనం

ప్రజాశక్తి - పిచ్చాటూరు: సత్యవేడు నియోజకవర్గంలో పోలీసుల ప్రోటోకాల్ ఉల్లంఘనపై ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం అసహనం వ్యక్తం చేశారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ తాను 50 ఏళ్ళ సుదీర్ఘ అనుభవం ఉన్న రాజకీయ నాయకుడినని, తాను ఎమ్మెల్యేగా ఉన్న సత్యవేడు నియోజకవర్గంలో ఎలాంటి ప్రోటోకాల్ లేని వ్యక్తులకు ఎస్కార్టులుగా జీపులతో ప్రోటోకాల్ డ్యూటీ చేయడం ఏమిటని ప్రశ్నించారు. తాను ఒక ఎమ్మెల్యేగా మండలాల్లో పర్యటిస్తే కనీసం ఒక ఎస్సై కూడా రావడం లేదని, జీపు రిపేరు అంటూ సాకులు చెబుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాగే కొనసాగితే తనకు పోలీసు ప్రోటోకాల్ అవసరం లేదని అసహనం వ్యక్తం చేశారు. ఈ విషయం జిల్లా ఎస్పీకి, పుత్తూరు డీఎస్పీకి ఫిర్యాదు చేశానని, వారు సానుకూలంగా స్పందించినట్లు ఎమ్మెల్యే వెల్లడించారు.

మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణ ఆపాలి : కిలివేటి



వైసీపీ నాయకులకు స్వాగతం పలుకుతున్న గ్రామస్తులు

ప్రజాశక్తి - నాయుడుపేట: రాష్ట్రంలో జరుగుతున్న మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా మాజీ సీఎం వైయస్ఆర్సీపీ అధ్యక్షులు వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు మాజీమంత్రి ఉమ్మడి నెల్లూరు జిల్లా వైఎస్ఆర్సీపీ అధ్యక్షులు డాక్టర్ కాకాణి గోవర్ధన్ రెడ్డి సూచనలు మేరకు చేపట్టిన కోటి సంతకాల సేకరణ కార్యక్రమంలో భాగంగా సూళ్లూరుపేట నియోజకవర్గం రైతు విభాగం అధ్యక్షులు కట్టా.భవాని శంకర్ రెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం నాయుడుపేట మండలం మేనకూరు పంచాయతీ లోని వద్దిగుంట కండ్రిగ గ్రామంలో పార్టీ నాయకులతో కలిసి ప్రభుత్వ మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా రచ్చబండ కార్యక్రమం నిర్వహించారు ఈ కార్యక్రమంలో భాగంగా ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా వైఎస్ ఆర్సీపీ ఆధ్వర్యంలో చేపట్టిన కోటి సంతకాల సేకరణ ఆవశ్యకతను మాజీ సూళ్లూరుపేట ఎంఎల్ఏ, వైయస్సార్సీపీ సూళ్లూరుపేట నియోజకవర్గ సమన్వయకర్త కిలివేటి.సంజీవయ్య ప్రజలకు వివరించి సంతకాలు సేకరించారు.ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ పేదలకు మెరుగైన వైద్యం మరియు పేద విద్యార్థులకు ఉచిత వైద్యవిద్యను అందించాలనే సంకల్పంతో వైయస్ జగన్మోహన్ రెడ్డి వైయస్సార్సీపీ పాలనలో ప్రజల కోసం చేపట్టిన 17 మెడికల్ కాలేజీలలో దాదాపుగా ఏడు కాలేజీలు పూర్తయ్యాయని మిగి లిన 10 మెడికల్ కాలేజీలను పూర్తి చేసి పేదలకు అందుబాటులోకి తీసుకురావాల్సింది పోయి, వాటిని ప్రైవేటుపరం చేసేందుకు పన్నుతున్న కుట్రలు అన్ని ఇన్ని కావన్నారు.పేదలంటే చంద్రబాబుకు ఎందుకంత చులకన బావమో అర్థం కావడం లేదన్నారు ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో కూటమి ప్రభుత్వం పూర్తిగా వైఫల్యం చెందిందని,ప్రభుత్వ మెడికల్ కాలేజీలను పూర్తిచేయడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారని మండిపడ్డారు.చంద్రబాబు తన అనుచరులకు ప్రభుత్వ మెడికల్ కాలేజీలను అప్పజెప్పి తద్వారా వేలకోట్లు దండుకోవాలని చూస్తున్నారని ఆరోపించారు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా వైసిపి ఆధ్వర్యంలో ప్రజా ఉద్యమం మొదలైందని, చంద్రబాబు నిర్ణయాన్ని మార్చుకోకపోతే ప్రజలే ఆయనకు బుద్ధి చెప్తారని హెచ్చరించారు.కోటి సంతకాల సేకరణ ఇప్పటికే చేపట్టడం జరిగిందని, వాటిని గవర్నర్ కు అందిస్తామని అలాగే నవంబర్ 04వ తేదీన మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా పార్టీ నాయకులు, ప్రజలు, అనుబంద విభాగాలతో కలిసి ప్రజా ఉద్యమ కార్యక్రమం చేపట్టనున్నట్లు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో వైస్సార్సీపీ జిల్లా ఉపాధ్యక్షులు తంబీ రెడ్డి.సుబ్ర హ్మణ్యం రెడ్డి,వైసీపీ పట్టణ అధ్యక్షులు కలికి. మాధవ్ రెడ్డి,మండల కన్వీనర్ ఒట్టురూ.కిషోర్ యాదవ్,నాయుడుపేట ఎంపీపీ కూరగొండ్ల. ధనలక్ష్మి,ఈదా రత్న శ్రీ, సర్పంచులు,పార్టీ అనుబంధ విభాగాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.